# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం   తెలుగు దిన పత్రిక

సంపుటి : 01   సంచిక : 52   క్రిష్ణా,   ఆదివారం   16- 11 - 2025   పేజిలు : 4   వెల. 2 /-







## ఘనంగా సీతారామాంజనేయ స్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం..

### ముఖ్య అతిథిగా పాల్గున్న నందిగామ ఎమ్మెల్యే సౌమ్య..



**ఎన్టీఆర్ జిల్లా,నందిగామ,నవంబర్ 15(క్రైం కౌంటర్ డెస్క్):** పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో శనివారం నాడు ఆధ్యాత్మిక శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యదేవాలయ కమిటీ చైర్మన్ మహంకాళి వెంకటేశ్వరరావు (వెంకన్న గురుస్వామి)ని శాలువాతో సత్కరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. దేవాలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన దిశగా కొత్త కమిటీ సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. దేవాలయ చారిత్రక ప్రాధాన్యతని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 1890%-%91 సంవత్సరాలలో నిర్మించబడిన ఈ పురాతన ఆలయం అప్పటినుంచి భక్తి పరవశంతో, విశేష పూజలతో, అపారమైన భక్తుల సందోహంతో గ్రామ హృదయంలో ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతుందని గుర్తుచేశారు. సీతారామాంజనేయ స్వామి అనుగ్రహంతో ఈ ఆలయం ప్రాంత ప్రజలకు శాంతి, సమృద్ధి, సాత్వికతకు నిలయంగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కమిటీ సభ్యులు సమిష్టిగా పనిచేసి దేవాలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు,కూటమి నేతలు,అధికారులు, ప్రజా ప్రతినిధులు,స్థానిక ప్రజాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొండపల్లి బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా..!

### -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.





**ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి, నవంబర్ 15(క్రైం కౌంటర్ డెస్క్ ):** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు.ఆయన శనివారం కొండపల్లి లోని బాలికల పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి అక్కడి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పలు సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బాలికల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం హైస్కూలులో క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## తనతో ఇదే నా చివరి ప్రయాణం'.. సతీవియోగంతో జనసేన నేత సత్య భావోద్వేగం



జనసేన పార్టీ సీనియర్ నేత ఇంట విషాదం.. విశాఖపట్నానికి చెందిన నేత బొలిశెట్టి సత్యనారాయణ సతీమణి నాగమణి కన్నమూశారు. ఈ విషయాన్ని బొలిశెట్టి సత్యనారాయణ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలియజేశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 3 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారని సత్యనారక్ష్ణ ట్వీట్ చేశారు. నాగమణి మృతిపై జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు సంతాపాన్ని తెలియజేశారు. ఆ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలంటూ జనసైనికులు ట్వీట్‌లు చేస్తున్నారు.

'ఇది నా జీవితంలో అత్యంత దుఃఖభరితమైన సమయాలలో ఒకటి.. నా జీవితంలో 4 మే 1983న అడుగుపెట్టిన నా ప్రియమైన భార్య నాగమణి, నా ప్రతి సంతోషం-సంక్షోభంలో నాతో నిలిచిన ఆమె, ఈరోజు ఉదయం 3:00 గంటలకు ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా ప్రతి సాధన వెనుక ఉన్న మౌనమైన బలం ఆమె. ఆమెతో కలిసి నా హృదయంలోని ఒక భాగం కూడా వెళ్లిపోయింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.. ఓం శాంతి' అంటూ బొలిశెట్టి సత్యనారాయణ ట్వీట్ చేశారు.

"మీ శ్రీమతి బొలిశెట్టి నాగమణి గారు పుణ్యాత్మురాలు. పవిత్రమైన కార్తిక మాసంలో అందునా ఏకాదశి నాడు బ్రహ్మముహూర్త కాలంలో సువాసినిగా మరణయాతన తెలియకుండా ఆమె సద్గతి పొందారు. విశ్వావసు సంవత్సర కార్తిక బహుళ ఏకాదశి

శుక్రవారం రాత్రి ఉత్తరా ఫల్గుణి నక్షత్రంలో చనిపోయారు. నవంబరు 17న కార్తీక సోమవారం నాడు దహన సంస్కారాలు జరిపించి.. మరుసటి రోజు అస్థి సంచయనం చేసి అస్థికలు, చితాభస్మం గోదావరిలో నిమజ్జనం చేయవచ్చు. మీ కులాచారం ప్రకారం పెద్దలను సంప్రదించి ఉత్తర క్రియలు జరిపించగలరు. వీలును బట్టి ప్రయాగ త్రివేణి సంగమంలో చితా భస్మం కలపితే మంచిది" అని తన మిత్రుడు ఎంవీఆర్ శాస్త్రి.. తన భార్య క్రియా కర్మల కోసం అవసరమైన సమయంలో అడగకుండానే ఈ సందేశాన్ని పంపించారని.. ఆమెకు సద్గతి దక్కిందన్న విషయం నా మనస్సుకు కాస్త ఊరట కల్పించిందని బొలిశెట్టి సత్య తెలిపారు. తన మిత్రుడి సూచనల ప్రకారం సోమవారం ఉదయం తన సతీమణి భౌతిక కాయానికి దహన సంస్కారాలు నిర్వహించి, ఆదివారం పెద కర్మ జరుపుతామని తెలిపారు.

బొలిశెట్టి సత్యనారాయణ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు.. ఆయన 2014 ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన జనసేన పార్టీలో చేరారు.. పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపిస్తున్నారు. న్యూస్ ఛానల్స్ డిబేట్లలో కూడా ఆయన జనసేన పార్టీ తరఫున మాట్లాడేవారు. అంతేకాదు ఆయన సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటారు. రాజకీయ పరిణామాలతో పాటుగా సామాజిక అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్వీట్‌లపై విశ్లేషణలు చేస్తుంటారు.

## స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం..

### "మన పరిశుభ్రత -మన ఆరోగ్యం" అనే శ్లోగన్‌తో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన సదస్సు..



**ఎన్టీఆర్ జిల్లా,జగ్గయ్యపేట,నవంబర్ 15(క్రైం కౌంటర్ డెస్క్):** స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం సేనివారం నాడు జగ్గయ్యపేట పట్టణాన్ని సందర్శించారు. పరిశుభ్రతలో నవీన మార్పులు, ఆధునిక వేస్ట్ -మానేజ్మెంట్ పద్ధతుల అమలు, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు.జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో పట్టాభిరాం తో పాటు మాజీ మంత్రి మరియు కడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం కూడా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సమస్యలు, మున్సిపాలిటీ పనితీరు, పరిశుభ్రత చర్యలు, కాలుష్య నిర్మూలన పథకాలు, డ్రెయినేజ్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు నేతలు సమగ్రంగా చర్చించారు.

జగ్గయ్యపేట పట్టణం పరిశుభ్రతలో ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలవాలంటే మున్సిపల్ యంత్రాంగం మరింత చురుకుదనంతో పనిచేయాలని, స్వచ్ఛంద కార్పొరేషన్ తరఫున అవసరమైన సాంకేతిక సహాయం, నిధులు, పరికరాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై శాశ్వత అవగాహన పెంపు కోసం పాఠశాలలు, సంఘాలు, సాయుధ దళాలు, డ్వాక్రా సమూహాలతో కలిసి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ..పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత అనేవి ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమైన అంశాలని, ప్రభుత్వం మున్సిపాలిటీప్రజా ప్రతినిధులుప్రజలు కలిసి పనిచేస్తేనే పట్టణాన్ని పూర్తిగా శుభ్రమైన మోడల్ టౌన్‌గా మార్చగలమని పేర్కొన్నారు. జగ్గయ్యపేటలో దీర్ఘకాలిక శానిటేషన్ ప్రణాళిక రూపొందించేందుకు ప్రత్యేక బృందం అవసరమని సూచించారు. పట్టాభిరాం సందర్శన పట్టణ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, రెవెన్యూ అధికారులు మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## శ్రీసిటీ విప్లవం.. 6 వేల ఎకరాల విస్తరణతో ఉద్యోగాల వర్షం



ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ఇకపై కేవలం పారిశ్రామిక కేంద్రం మాత్రమే కాదు, అది ఒక ఆర్థిక విప్లవానికి నాంది! ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 6 వేల ఎకరాల విస్తరణ ప్రణాళికను ప్రకటించారు, దీనితో మరో 50 కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఈ ప్రాజెక్ట్ 1.5 లక్షల ఉద్యోగ అవకాశాలను సృష్టించి, శ్రీసిటీని దేశంలోనే ఒక మోడల్ సిటీగా నిలుపనుంది. ఈ విస్తరణ రాష్ట్ర ఆర్థిక వృద్ధికి బలమైన ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హెల్త్‌కేర్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఇంజినీరింగ్ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు శ్రీసిటీలో స్థాపనకు అనుమతులు పొందాయి. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యం ద్వారా సాంకేతిక ఆవిష్కరణలు, నాణ్యమైన ఉత్పత్తులు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ కంపెనీలు స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అవకాశాలను కూడా కల్పించనున్నాయి. దీంతో శ్రీసిటీ ఒక గ్లోబల్ హబ్‌గా రూపొందనుంది.శ్రీసిటీ ఆధునిక సౌకర్యాలతో మరింత ఆకర్షణీయంగా మారనుంది. త్వరలో ఇక్కడ ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం జరగనుందని సీఎం ప్రకటించారు, ఇది లాజిస్టిక్స్, రవాణా సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతేకాక, ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఈ చర్యలు పారిశ్రామికవేత్తలకు శ్రీసిటీని ఒక ఆదర్శవంతమైన గమ్యస్థానంగా మార్చనున్నాయి. సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఐదు కొత్త యూనిట్లను ప్రారంభించారు, ఇది శ్రీసిటీ పురోగతికి ఒక మైలురాయి. ఈ యూనిట్లు వివిధ రంగాల్లో ఉత్పత్తిని పెంచడమే కాక, వేలాది ఉద్యోగాలను కల్పించనున్నాయి. శ్రీసిటీ ఇప్పటికే దేశంలోని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ కొత్త ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా మరింత బలపడనుంది.

